సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 21 । ఆగస్టు । 2025



ఏబీసీ.. తాళం వేసి ఏడాది

వీధి కుక్కల నియంత్రణ కోసం రూ.లక్షల వ్యయంతో కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన ఏబీసీ కేంద్రం మూతబడింది. 8లో



.. ప్రజాభిప్రాయ సేకరణ

మణుగూరులో ఓసీ విస్తరణ భూసేకరణ కోసం అదనపు కలెక్టర్, ఎమ్మెల్యేతో పాటు సింగరేణి అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 24°

వాతావరణం

జిల్లాలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత పలు చోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కమనీయం.. రామయ్య నిత్య కల్యాణం



గిరి ప్రదక్షిణ చేస్తున్న శ్రీనివాసరావు, భక్తులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా సాగింది. తొలుత తెల్లవారు జామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువు దీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

వైభవంగా గిరి ప్రదక్షిణ..

శ్రీ రామచంద్రస్వామి జన్మ నక్షత్రమైన పునర్వసు సందర్భంగా కొత్తగూడేనికి చెందిన భక్త రామదాసు ట్రస్ట్ నిర్వాహకులు కంచర్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం భద్ర గిరి ప్రదక్షిణ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఆలయంలో స్వామి పాద ప్రదక్షిణకు వీలు లేనందున గిరిప్రదక్షిణే సులభ మార్గమని అన్నారు. అనంతరం స్వామివారి మూలమూర్తులను దర్శించుకున్నారు. కార్యక్రమంలో కంచర్ల శ్రీనివాసరావు దంపతులు, ఆలయ సూపరింటిండెంట్ లింగాల సాయిబాబా, భక్తులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి గుడిలో నేడు రుద్రహోమం

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాధపురం మధ్య కొలువైన శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా గురువారం రుద్ర హోమం నిర్వహించనున్నట్లు ఈఓ ఎస్.రజనీకుమారి తెలిపారు. ఉదయం 9 గంటలకు మొదలయ్యే హోమంలో పాల్గొనే భక్తులు రూ.1,516 చెల్లించి గోత్రనామాలను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 63034 08458 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రేపు బహిరంగ వేలం..

శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయ పరిధిలో పలు పనులు అప్పగించేందుకు 22వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ రజనీకుమారి తెలిపారు. కొత్త, పాత కాంప్లెక్స్‌లోని పలు షాపులే కాక చీరలు పోగు చేసుకోవడం, పూలదండల విక్రయం తదితర పనులకు టెండర్లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ.200 చెల్లించి షెడ్యూల్ ఫాం తీసుకుని, ధరావత్తు డీడీ జతపరిచి వేలంలో పాల్గొనాలని సూచించారు.

కిన్నెరసానిని సందర్శించిన ఎఫ్‌బీఓలు



పంపిణీ చేసిన కిట్లతో సిబ్బంది, అధికారులు

పాల్వంచరూరల్ : హైదరాబాద్ ధూల్‌పేట ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 40 మంది ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు(ఎఫ్‌బీఓ) శిక్షణలో భాగంగా బుధవారం పాల్వంచ మండలంలోని కిన్నెరసాని డీర్‌పార్కును సందర్శించారు. అనంతరం వన్యప్రాణులు, అటవీ సంపద సంరక్షణపై వారికి వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ బాబు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అకాడమీ కోర్సు డైరెక్టర్ అశోక్‌కుమార్, స్థానిక వైల్డ్‌లైఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైల్డ్‌లైఫ్ సిబ్బందికి కిట్లు..

విధి నిర్వహణలో వైల్డ్‌లైఫ్ సిబ్బంది అటవీ ప్రాంతంలో ఇబ్బంది పడకుండా అత్యవసరంగా వినియోగించుకునే పలు రకాల వస్తువుల కిట్లను కిన్నెరసాని డీర్‌పార్కు వద్ద వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ బాబు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 మంది సిబ్బందికి రూ.1.20 లక్షల విలువైన కిట్లను వైల్డ్‌లైఫ్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా అందజేసిందని తెలిపారు. కార్యక్రమంలో రేంజర్ కవితామాధురి, సెక్షన్ అధికారి బి.కిషన్, ఎఫ్‌ఎస్‌ఓ బి.సునీత, కృష్ణయ్య, ఎఫ్‌బీఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



భద్రాచలం బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

ఉప్పొంగిన గోదావరి

భద్రాచలం వద్ద పెరుగుతున్న నీటిమట్టం

- ఒక్కరోజే మొదటి, రెండో ప్రమాద హెచ్చరికలు
- ముంపు ప్రజలకు మంత్రి, అధికారుల సూచనలు
- కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

భద్రాచలం: భద్రాచలం వద్ద గోదావరి ప్రమాద దిశగా ప్రవహిస్తోంది. మంగళవారం నెమ్మదిగా పెరిగిన నీటిమట్టం.. అర్ధరాత్రి నుంచి శరవేగంగా పుంజుకుంది. బుధవారం ఉదయం మొదటి ప్రమాద హెచ్చరిక దాటగా, రాత్రి 10.05 గంటలకు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. దీంతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్ తదితరులు ముంపు ప్రజలను అప్రమత్తం చేసి, పలు సూచనలు చేశారు.

ముంపు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

భద్రాచలం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ముంపు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో



స్నానఘట్టాల వద్ద గోదారి ప్రవాహం ఇలా..

పేర్కొన్నారు. కలెక్టర్‌తో పాటు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. నది పరీవాహక గ్రామాల్లో నివసించే ప్రజలకు ముందుగానే సమాచారం అందించడంతో పాటు అవసరమైన వారిని సురక్షిత ప్రదేశాలకు తరలించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయక బృందాలు సిద్ధంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని పేర్కొన్నారు. నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

గోదావరి వరదల నేపథ్యంలో భద్రాచలంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసినట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ తర్వాత కలెక్టర్.. ఎస్పీ రోహిత్‌రాజ్‌తో కలిసి భద్రాచలంతో పాటు దుమ్ముగూడెం మండలంలో పర్యటించారు. తూరుబాక డైవర్షన్ రోడ్డును, భద్రాచలం కరకట్ట వద్ద గోదావరి ఉధృతిని పరిశీలించారు.

ఎగువ నుంచి వరద..

గోదావరి ఎగువ ప్రాంతాల్లో రెండు, మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీనికి తోడు తాలిపేరు ప్రాజెక్టు సైతం నిండడంతో ఆ గేట్ల ద్వారా నీటిని గోదావరిలోకి వదిలారు. దీంతో నది ప్రవాహం శరవేగంగా పెరిగింది. మంగళవారం నెమ్మదిగా పెరిగినా.. అర్ధరాత్రి నుంచి ఊపందుకుంది. బుధవారం ఉదయం 8.15 గంటలకు 43 అడుగులకు చేరడంతో సబ్‌కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రాత్రి 10.05 గంటలకు 48 అడుగులు నమోదు కాగా, రెండో ప్రమాద హెచ్చరిక విడుదల చేశారు. కాగా, నీటి మట్టం క్రమంగా పెరుగుతోందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు తెలిపారు.

అనంతరం మాట్లాడుతూ.. ఎగువన కురుస్తున్న వర్షాలతో గోదావరి క్రమంగా పెరుగుతోందని, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఉధృతంగా ప్రవహిస్తున్న చెరువులు, వాగుల వద్దకు వీడియోలు, సెల్ఫీల కోసం వెళ్లి ప్రమాదాలకు గురి కావొద్దని సూచించారు. వాహనదారులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. అత్యవసర పరిస్థితి ఎదురైతే పాల్వంచలో 08744 -241950, వాట్సాప్ నంబర్ 93929 19743, భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో 79952 68352, సబ్ కలెక్టరేట్‌లో 08743 – 2324444, వాట్సాప్ నంబర్ 93479 10737 కంట్రోల్ రూమ్ నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

గోదావరి ప్రవాహం ఇలా..

సమయం	అడుగులు	క్యూసెక్కులు
మంగళవారం అర్ధరాత్రి 1	39.3	7,73,550
బుధవారం తెల్లవారుజామున 3	40.40	8,19,285
ఉదయం 8.15	43.00	9,32,288
మధ్యాహ్నం 12	44.30	9,88,792
సాయంత్రం 4	45.90	10,48,826
రాత్రి 8	47.40	11,15,568
రాత్రి 11	48.30	11,59,535

నీట మునిగిన పర్ణశాల



వరద నీటితో నిండిపోయిన పర్ణశాల నారచీరల ప్రాంతం

దుమ్ముగూడెం : ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో గోదావరికి వరద నీరు భారీగా చేరుతోంది. దీంతో పర్ణశాల, కాశీనగరం, సున్నంబట్టి, దుమ్ముగూడెం వద్ద నది ఉధృతంగా ప్రవహిస్తోంది. పర్ణశాల నారచీరల ప్రాంతం, అక్కడి దుకాణాలు పూర్తిగా నీట మునిగాయి. సున్నంబట్టి – బైరాగులపాడు గ్రామాల మధ్య రహదారిపైకి వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. తూరుబాక డైవర్షన్ రోడ్డుకు వరద చేరగా వాహనాలను ములకపాడు మీదుగా మారాయిగూడెం వయా ఎటపాక మీదుగా నడిపిస్తున్నారు.

వరద ఉధృతి పరిశీలన



భద్రాచలంలో వరద ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

భద్రాచలంఅర్బన్/దుమ్ముగూడెం : భద్రాచలం వద్ద గోదావరి వరద ఉధృతిని కలెక్టర్ జితేష్.వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ పరిశీలించారు. పట్టణ, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. నది వద్ద విధుల్లో ఉన్న ఎన్డీఆర్ఎఫ్, డీడీఆర్ఎఫ్ బృందాలకు పలు సూచనలు చేశారు. అనంతరం దుమ్ముగూడెం మండలం తూరుబాక డైవర్షన్ రోడ్డును తనిఖీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారని, ప్రజలు యంత్రాంగానికి సహకరించాలని కోరారు. అలాగే వరద నీటితో మునిగిన సున్నంబట్టి – బైరాగులపాడు రహదారిని సబ్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్, సీఐ అశోక్, ఎంపీడీఓ వివేక్‌రామ్, ఆర్ఐలు కల్లూరి వెంకటేశ్వరరావు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కొత్తగూడెంటౌన్: జిల్లాలో కురుస్తున్న వర్షాలు, వరదల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రోహిత్‌రాజు ఒక ప్రకటనలో సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో సాయం కోసం డయల్ 100కు ఫోన్ చేయాలని తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం క్రమంగా పెరుగుతోందని, లోతట్టు ప్రాంతాల వారు జాగ్రత్తగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని కోరారు. ఉధృతంగా ప్రవహిస్తున్న చెరువులు, వాగుల వద్దకు వీడియోలు, సెల్ఫీల కోసం వెళ్లి ప్రమాదాలకు గురికావొద్దని పేర్కొన్నారు.

సాధారణ వర్షపాతం నమోదు

- జిల్లా సగటు 14.3 మి.మీ.
- 11 మండలాల్లో అధిక వర్షాలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో సీజనల్ వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోయినా.. వాయుగుండాల ప్రభావంతో ఇప్పటివరకు సాధారణ వర్షపాతం నమోదైంది. జూన్‌లో సాధారణ వర్షపాతం 169.1 మి.మీటర్లకు 134.4 మి.మీ. కురిసి 20.5 మి.మీ.లోటుగా నమోదైంది. జూలైలో సాధారణ వర్షపాతం 312.7 మి.మీ.కు 378.9 మి.మీ. కురిసి 21.2 శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఆగస్టులో ఇప్పటివరకు 209.8 మి.మీ.కు 277 మి.మీ. కురిసి 32 శాతం అధికంగా నమోదైంది. జిల్లాలో ఇప్పటి వరకు 23 మండలాల్లో సరాసరి 14.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు అత్యధికంగా పాల్వంచలో 75.4 మి.మీ. కరకగూడెం మండలంలో 1.2, పినపాకలో 0.6, చర్లలో 4.4, దుమ్ముగూడెంలో 1.2, అశ్వాపురంలో 0.6, మణుగూరులో 5.6, గుండాలలో 0.6, ఇల్లెందులో 68.6, టేకులపల్లిలో 64.2, జూలూరుపాడులో 21.2, చంద్రుగొండలో 20, అన్నపురెడ్డిపల్లిలో 16.8, చుంచుపల్లిలో 55.2, సుజాతనగర్‌లో 50.2, కొత్తగూడెంలో 74.4, లక్ష్మీదేవిపల్లిలో 53.8, పాల్వంచలో 75.4, బూర్గంపాడులో 48.6, భద్రాచలంలో 30.4, ములకలపల్లిలో 60.4, దమ్మపేటలో 4.4, అశ్వారావుపేట మండలంలో 9.2 మి.మీ వర్షపాతం నమోదైంది. కాగా, జిల్లాలోని 11 మండలాల్లో జూన్ 1 నుంచి ఇప్పటివరకు అధిక వర్షపాతం నమోదైంది. వీటిలో మణుగూరు, ఇల్లెందు, టేకులపల్లి, జూలూరుపాడు, చంద్రుగొండ, చుంచుపల్లి, సుజాతనగర్, కొత్తగూడెం, పాల్వంచ, బూర్గంపాడు, అశ్వారావుపేట ఉండగా, కరకగూడెం, పినపాక, చర్ల, దుమ్ముగూడెం, అశ్వాపురం, ఆళ్లపల్లి, గుండాల, అన్నపురెడ్డిపల్లి, లక్ష్మీదేవిపల్లి, భద్రాచలం, ములకలపల్లి, దమ్మపేట మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

కేటీపీఎస్ ఆధునికీకరణకు ప్రోత్సాహకం అందించాలి

పార్లమెంట్‌లో ఎంపీ రఘురాంరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: పాల్వంచలోని కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్(కేటీపీఎస్) ఆధునికీకరణ, పాత ప్లాంట్ల పునరుద్ధరణకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ చొరవ చూపాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి కోరారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా బుధవారం లోక్‌సభలో మాట్లాడిన ఆయన.. తెలంగాణలో 820 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న కేటీపీఎస్ ప్లాంట్ దక్షిణ భారతదేశంలోనే ప్రఖ్యాతి గాంచిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా రెండు 800 మెగావాట్ల యూనిట్లుగా ఆధునికీకరణ చేపట్టాలని, ఇందుకు అవసరమైన బొగ్గు నిల్వలు, గోదావరి జలాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈమేరకు పాత థర్మల్ స్టేషన్లకు ఆర్అండ్ఎం వంటి కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ సమన్వయంతో సహకారం అందించాలని ఎంపీ కోరారు.

గణపతి ఉత్సవాల్లో జాగ్రత్తలు పాటించాలి

విద్యుత్ ఎస్ఈ మహేందర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): వినాయక నవరాత్రుల వేడుకల్లో తగిన జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ జి.మహేందర్ మండపాల నిర్వాహకులకు సూచించారు. విగ్రహాల వద్ద తీసుకోవాల్సిన చర్యలపై టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి బుధవారం కార్పొరేట్ విద్యుత్ భవన్ నుంచి 16 సర్కిళ్ల పరిధిలోని ఎస్ఈలు, డీఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీసీ అనంతరం ఎస్ఈ మహేందర్ మాట్లాడుతూ.. గణేష్ మండపాలు, విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. తరలింపు సందర్భంగా విగ్రహాల ఎత్తును బట్టి రూట్‌ను నిర్ణయించుకోవాలని, ఎక్కడైనా సమస్య ఉంటే విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. విద్యుత్ లైన్ల నుంచి కనీసం రెండడుగుల దూరం పాటించాలని, ఎత్తయిన మెటల్ విగ్రహాల తరలింపులో మరింత అప్రమత్తంగా ఉండాలని కోరారు. మెటల్ ఫ్రేమ్‌తో చేసిన డెకరేషన్‌లను వీలైనంత మేరకు తగ్గించాలని అన్నారు. మండపాలకు విద్యుత్ సరఫరా కోసం తమ సిబ్బంది ద్వారానే కనెక్షన్ పొందాలని, ఐఎస్ఐ మార్క్ కలిగిన ప్రామాణిక విద్యుత్ వైర్లను మాత్రమే వాడాలని, జాయింట్ వైర్లను వాడొద్దని, తగిన కెపాసిటీ కలిగిన ఎంసీబీ తప్పని సరిగా వినియోగించాలని వివరించారు. విద్యుత్ లైన్లు తెగిపడినా, ఇతర అత్యవసర పరిస్థితులు ఏర్పడినా 1912 నంబర్‌కు లేదా సమీప ఫ్యూజ్ కాల్ ఆఫీసుకు సమాచారం అందించాలని చెప్పారు.

గంజాయి ముఠా పట్టివేత

- లారీలో తరలిస్తుండగా 90 కేజీలు స్వాధీనం
- నిందితుల వద్ద ఆరు పిస్టళ్లు లభ్యం
- ముగ్గురిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ అధికారులు

పాల్వంచ: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఓ ముఠాను ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. వారి వద్ద ఆరు పిస్టళ్లు ఉన్నట్లు గుర్తించగా.. ఎక్సైజ్, పోలీస్ శాఖ ఉన్నతాధికారులు లోతుగా విచారిస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఒడిశా నుంచి తమిళనాడు రాష్ట్రానికి లారీలో ఓ ముఠా గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు పాల్వంచ మండలం జగన్నాథపురం సమీపంలో ఓ లారీని ఆపి తనిఖీ చేశారు. లారీ ముందు వస్తున్న ఓక్స్ వ్యాగన్ పోలో కారును సైతం ఆపారు. లారీలో తరలిస్తున్న 90 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకోగా, కారులో ఉన్న ముగ్గురి వద్ద ఆరు దేశీ పిస్టళ్లు ఉన్నట్లు గుర్తించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో ఇద్దరిది తమిళనాడు కాగా, ఒకరిది కేరళ రాష్ట్రంలోని కొచ్చిగా గుర్తించారు. గంజాయితో పాటు పిస్టళ్లు కూడా లభ్యం కావడంతో ఎక్సైజ్, పోలీసు ఉన్నతాధికారులు రంగంలోకి దిగి లోతుగా విచారిస్తున్నారు. ఎస్పీ రోహిత్‌రాజు, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్, ఇతర ఉన్నతాధికారులు ఈ ఘటనపై ఆరా తీస్తున్నారు. గంజాయి తరలింపులో పిస్టళ్లు ఎందుకు తీసుకెళ్తున్నారు.. వారికి గ్యాంగ్‌స్టర్లతో ఏమైనా సంబంధాలు ఉన్నాయా.. ఆయుధాలు ఎక్కడి నుంచి సేకరించారు.. అనే అంశాలపై విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా కేసు దర్యాప్తులో ఉన్న సమయంలో గంజాయి పట్టుకున్న లారీని రిపేర్ కోసం బయటకు పంపించినట్లు తెలిసింది. ఈ విషయమై ఎక్సైజ్ సీఐ ప్రసాద్‌ను వివరణ కోరగా కేసు విచారణలో ఉందని, పూర్తి వివరాలు గురువారం వెల్లడిస్తామని తెలిపారు.

ఉపాధ్యాయుడికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న సురేష్‌బాబు

చంద్రుగొండ: చంద్రుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు చెన్ను సురేష్‌బాబుకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. హైదరాబాద్‌లో జరిగిన స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్ నారాయణన్, వీసీ కుమార్ చేతుల మీదుగా ఆయన డాక్టరేట్ పట్టా అందుకున్నారు. 'గణితశాస్త్రాన్ని ఐసీటీ ద్వారా బోధించడం' అంశంపై ఆయన సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబును బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఏ.వాజిద్ తదితరులు అభినందించారు.

యూరియా బ్లాక్ చేస్తే చర్యలు

ములకలపల్లి : యూరియా కోసం రైతులు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో డీలర్లు, వ్యాపారులు అక్రమంగా నిల్వ చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి.బాబూరావు హెచ్చరించారు. మండల పరిధిలోని వివిధ ఎరువుల దుకాణాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎరువుల క్రయ, విక్రయాలకు సంబంధించి రికార్డులు పక్కాగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ అరుణ్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఎల్‌పీపీ రిజిస్ట్రేషన్ రద్దుకు ప్రతిపాదన

సూపర్‌బజార్(కొత్తగూడెం): గత ఆరు సంవత్సరాలుగా ఎన్నికల్లో పోటీ చేయని భారత్ లేబర్ ప్రజాపార్టీని రిజిస్టర్డ్ పార్టీల జాబితా నుంచి తొలగించాలని ప్రతిపాదిస్తున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951 లోని సెక్షన్ 29 ఏ ప్రకారం ఆ పార్టీ విధి విధానాలు అమలు చేయడం లేదని, దీంతో ఎన్నికల కమిషన్ తన అధికారాలను వినియోగించుకుంటూ ఈ పార్టీని రిజిస్టర్ పార్టీల జాబితా నుంచి తొలగించేందుకు ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. ప్రాతినిధ్యం ఏమైనా ఉంటే ఆపార్టీ అధ్యక్షులు లేదా ప్రధాన కార్యదర్శి ఈనెల 25లోపు తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి అఫిడవిట్ అందజేయాలని సూచించారు. ఈనెల 29న నిర్వహించే విచారణకు పార్టీ అధ్యక్షుడు లేదా ప్రధాన కార్యదర్శి తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు.

కిన్నెరసాని జోరు..

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కిన్నెరసాని జలాశయంలోకి వరద కొనసాగుతోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం గల ఈ రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి బుధవారం వెయ్యి క్యూసెక్కుల నీరు రావడంతో నీటిమట్టం 404.60 అడుగులకు పెరిగింది. దీంతో ఒక గేటు ఎత్తి 3వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు ఏఈ తెలిపారు. – పాల్వంచరూరల్



కిన్నెరసాని నుంచి విడుదలవుతున్న నీరు



తాలిపేరు నుంచి దిగువకు విడుదల చేస్తున్న వరద

తాలిపేరు హోరు..

తాలిపేరు ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో ఐదు గేట్లు ఎత్తి 9,225 క్యూసెక్కుల చొప్పున వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 74.00 మీటర్లు కాగా, ప్రస్తుతం 71.28 మీటర్లుగా క్రమబద్ధీకరిస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం వరకు మరింతగా వరద పెరిగే అవకాశం ఉందని ప్రాజెక్టు డీఈ తిరుపతి తెలిపారు. – చర్ల

ఏబీసీ.. తాళం వేసి ఏడాది..

- కొత్తగూడెం కార్పొరేషన్‌లో వీధి కుక్కల స్వైర విహారం
- పిల్లలు, వృద్ధులపై అధికమవుతున్న దాడులు
- భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు
- పట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



కొత్తగూడెంలోని ఏబీసీ సెంటర్

కొత్తగూడెంఅర్బన్: కుక్కల సంఖ్యను నియంత్రించేందుకు రూ.లక్షల వ్యయంతో జిల్లా కేంద్రంలో నిర్మించిన యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) సెంటర్ ప్రస్తుతంనిరుపయోగంగా మారింది. అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంతో ఏడాది కాలంగా మూతబడి ఉంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కుక్కకాటుకు గురైన వ్యక్తివర్షంలో తడిస్తే ప్రాణాపాయ స్థితికి చేరే ప్రమాదం ఉంది. కానీ, కుక్కల నియంత్రణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

ఎక్కువైన శునకాల సంచారం

కార్పొరేషన్ పరిధిలోని కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్ డివిజన్లలో కుక్కల సంచారం ఎక్కువగా ఉంది. ఆయా డివిజన్ల నుంచి అధికారులకు నిత్యం ఫిర్యాదు చేస్తున్నారు. అయినా కూడా అధికారులలో చలనం రావడం లేదు. కుక్కలు కరిచిన వారు ఘటనా స్థలం నుంచి నేరుగా గతంలో కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చి సంబంధిత అధికారులను నిలదీసిన ఘటనలున్నాయి. వర్షాకాలం కావడంతో పిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటే భయపడుతున్నారు. పిల్లలు పాఠశాలలు, ట్యూషన్లకు వెళ్లే సమయంలో కుటుంబ సభ్యులు వారి వెంట రక్షకులుగా వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.

బిల్లులు చెల్లించకనే..

కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని రైటర్‌బస్తీ గొల్లగూడెంలో 2021లో యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభించారు. ఏడాదికాలంగా కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో మూసివేశారు. కాంట్రాక్టర్‌కు సుమారు రూ.6 లక్షల బిల్లు రావాల్సి ఉందని తెలిసింది. ఈ సెంటర్‌లో గోప్యంగా కుక్కలకు కుటుంబ నియంత్రణ వాక్సిన్లు వేసేవారు. కాగా, కుక్కలకు సెంటర్‌లో సరైన ఆహారం అందించడం లేదని గొడవలు కావడం, సెంటర్‌కు తెచ్చిన కుక్కలను ఎక్కడ పట్టుకున్నారో అక్కడే వదిలకుండా.. సెంటర్ పరిసరాల్లోనే వదిలడంతో స్థానికులు ఆందోళన చేసిన ఘటనలున్నాయి. బిల్లులకు తగ్గట్టుగా సెంటర్‌లో కుక్కల సంఖ్య లేకపోవడాన్ని పలువురు గమనించారు.

కొత్తగా పాల్వంచలో..

ప్రస్తుతం పాల్వంచ ప్రాంతంలో మరో ఏబీసీని నూతనంగా నిర్మించారు. అయితే అక్కడకు కొత్తగూడెం, సుజాతనగర్, పాల్వంచ డివిజన్లలోని కుక్కలను పట్టి.. అక్కడే వ్యాక్సినేషన్ ప్రక్రియ చేపట్టేందుకు అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. కొత్తగూడెం, సుజాతనగర్‌లోని కుక్కలను పాల్వంచకు తీసుకెళ్లి, వ్యాక్సిన్ వేసి, తిరిగి వాటిని ఆయా ప్రాంతాలకు తీసుకురావాలంటే శ్రమతో కూడిన అంశం. అలా కాకుండా రెండు సెంటర్లు అందుబాటులో ఉన్నాయి కాబట్టి ఎక్కడి వాటిని అక్కడే పట్టించి, వ్యాక్సిన్ వేస్తే బాగుంటుందని జంతు ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు. ఆ రకంగా కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరముంది. లేదంటే ఏబీసీ సెంటర్లకు వెళ్లిన కుక్కలు తిరిగి అదే ప్రాంతానికి రాకపోవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

దాడులతో భయాందోళన..

కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో కుక్కలు దాడులు చేయడం వల్ల గాయపడిన వారు, విషయం తెలుసుకున్న వారు భయాందోళన చెందుతున్నారు. కొత్తగూడెంలోని భజనమందిరం రోడ్డు, హనుమాన్‌బస్తీ, బూడిదగడ్డ, రామాటాకీస్ ఏరియా, రాజీవ్‌పార్కు ఏరియా, గొల్లగూడెం తదితర ప్రాంతాల్లో పగలు, రాత్రులు గుంపులు, గుంపులుగా కుక్కలు తిరుగుతున్నాయి. వాటి నుంచి రక్షణ కల్పించాలని స్థానిక ప్రజలు కార్పొరేషన్ అధికారులకు వినతి పత్రాలు అందజేస్తున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్‌లో కుక్కల బెడదను తగ్గించేందుకు గానూ వాటిని పట్టి వ్యాక్సిన్ వేయాల్సిన అవసరముందని ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు ఇప్పటికై నా దృష్టిసారించి, కుక్కల సంఖ్య ప్రకారం బిల్లులు చెల్లించాలని, లేనిపక్షంలో కుక్కలను పట్టకున్నా.. పట్టినట్లు చూపి, లెక్కలు తారుమారు చేసే అవకాశాలు ఉంటాయని పలువురు ఆరోపిస్తున్నారు.

క్లుప్తంగా

స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా 419 సీట్లు భర్తీ

భద్రాచలంటౌన్: ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో సీట్ల భర్తీకి బుధవారం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించారు. భద్రాచలంలోని గిరిజన గురుకుల కళాశాలలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 419 సీట్లు భర్తీ అయ్యాయని గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ అరుణకుమారి తెలిపారు. గురుకుల విద్యాలయాల్లో ఐదు నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహించగా బాలికలు 121 మంది, బారులు 298 మంది చేరారని వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలోని పలు గురుకులాల ప్రిన్సిపాళ్లు రమాదేవి, రాణి, చైతన్య, మాధవీలత, శిరీష, మాధవి, వీరస్వామి, సురేశ్, శ్యాంకుమార్, హరికృష్ణ, భాస్కర్ పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో విఫలం


మాట్లాడుతున్న రేగా కాంతారావు

ఇల్లెందు: ప్రభుత్వం యూరియా సరఫరాలో ఘోరంగా విఫలమైందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆరోపించారు. బుధవారం ఇల్లెందులో దిండిగాల రాజేందర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రైతులు యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారని తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన, 20 నెలల కాంగ్రెస్ పాలనను రైతులు పోల్చి చూసుకోవాలన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నేతలు దిండిగాల రాజేందర్, ఎస్.రంగనాథ్, భావ్‌సింగ్‌నాయక్, పోషం, వరప్రసాద్, చీమల సత్యనారాయణ, అబ్దుల్ నబీ, ఘాజీ, జబ్బార్ తదితరులు ఉన్నారు.

కొబ్బరితోటల పెంపకంపై శిక్షణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొబ్బరి తోటల పెంపకం,యాజమాన్య పద్ధతులపై కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు అధ్వర్యాన రైతులకు శిక్షణ ఇచ్చారు. చుంచుపల్లి మండలం గరిమెళ్లపాడులోని ఉద్యాననర్సరీలో బుధవారం ఏర్పాటు చేసిన శిక్షణకు కోకోనట్ బోర్డు డీడీ మంజునాథ్‌రెడ్డి, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల ఉద్యాన అధికారులు మధుసూదన్, జంగా కిశోర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు అమలు చేస్తున్న పథకాలు, సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తులను అధికారులకు అందజేయాలని సూచించారు.

సైబర్ మోసానికి గురైన వ్యక్తి

దశలవారీగా

రూ.1.17.946 కోల్పోయిన బాధితుడు

చంద్రుగొండ: మండల కేంద్రం శివారు ఇమ్మడి రామయ్యబంజర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సైబర్ వలలో పడి ఆర్థికంగా నష్టపోయిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. ఇమ్మడి రామయ్య బంజర్‌కు చెందిన వీరబోయిన మురళీకి ఇటీవల ఓ అపరిచిత వ్యక్తి ఫోన్ చేశాడు. రూ.లక్ష లోన్ మంజూరైందని, అందుకు గాను బ్యాంక్ పాస్‌బుక్, పాన్‌కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలు వాట్సప్ చేయాలని చెప్పడంతో అలాగే చేశాడు. రూ.2 వేలు మొదలుకుని దశలవారీగా రూ.1,17,946 నగదు ఫోన్‌పే చేశాడు. తర్వాత అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో మురళి సైబర్ క్రైం అధికారులను ఆశ్రయించాడు. స్థానిక ఎస్ఐ శివరామకృష్ణ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.


దుమ్ముగూడెం : పర్ణశాల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి


దుమ్ముగూడెం : సున్నంబట్టి - బైరాగులపాడు రహదారిపైకి చేరిన వరద

● మునిగిన పంటలు.. నిలిచిన రాకపోకలు

గోదావరి నదికి భారీగా వస్తున్న వరదతో పలు గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. రహదారులపైకి నీరు చేరి ఆయా ప్రాంతాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తాలిపేరు బ్యాక్‌వాటర్‌తో దండుపేట - కొత్తపల్లి మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి - ఆమెర్ద గ్రామాల నడుమ కూడా రవాణా స్తంభించింది. ఆయా గ్రామాల్లో వరి, పత్తి పంటలు మునిగిపోయాయి. దుమ్ముగూడెం మండలం పర్ణశాల, కాశీనగరం, సున్నంబట్టి తదితర గ్రామాల్లోనూ రాకపోకలకు అంతరాయం వాటిల్లింది.

– చర్ల/దుమ్ముగూడెం/అశ్వాపురం


చర్ల : దేవరాపల్లిలో మునిగిన వరి పాలం


అశ్వాపురం : అమ్మగారిపల్లి - అమెర్ద రహదారిపై నిలిచిన నీరు

పర్యావరణ అనుమతిపై ప్రజాభిప్రాయ సేకరణ


సభలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

మణుగూరుటౌన్: మణుగూరు ఓసీ విస్తరణలో భాగంగా పర్యావరణ అనుమతులపై బుధవారం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ప్రస్తుత మణుగూరు ఓసీలో బొగ్గు నిల్వలు మరో ఆరు నెలల్లో అడుగంటనుండగా, రాష్ట్ర విద్యుత్ అవసరాల నేపథ్యంలో ఓసీ విస్తరణ అనివార్యమైంది. దీంతో మండలంలోని తిర్లాపురం, రామానుజవరం, మున్సిపాలిటీలోని కొమ్ముగూడెంలో రైతుల నుంచి 813 ఎకరాలు సేకరించనుంది. పర్యావరణ అనుమతులకు సింగరేణి దరఖాస్తు చేయగా, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ బి.రవీందర్ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం దుర్గం రాంచందర్ మాట్లాడుతూ.. మణుగూరు ఓసీ విస్తరణతో కలిగే ప్రయోజనాలు, మణుగూరు అభివృద్ధికి సింగరేణి చేపట్టిన చర్యలను వివరించారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ, ప్రాజెక్ట్ ప్రభావిత గ్రామాల్లో ఆర్ఓఆర్ ప్లాంట్, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాల్సిన బాధ్యత సింగరేణిపై ఉందన్నారు. కార్యక్రమానికి హాజరైన రామానుజవరం, తిర్లాపురం, కొమ్ముగూడెం నిర్వాసితులు, రాజుపేట గ్రామస్తులు మాట్లాడుతూ.. సింగరేణి పరిసర గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టాలని, గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునందించాలని, నిత్యం దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్న రాజుపేటను తరలించాలని వేడుకున్నారు. కంపెనీలో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని, పరిసర గ్రామాల్లో భారీ ఎత్తున మొక్కలు పెంచి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో వెల్లడించిన అభిప్రాయాలను వీడియో చిత్రీకరించి భద్రపరుస్తున్నట్లు అధికారులు చెప్పారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుమ, తహసీల్దార్ అద్దంకి నరేశ్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, కమిషనర్ ప్రసాద్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు త్యాగరాజన్, కృష్ణంరాజు, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ రాంగోపాల్, సీపీఐ నాయకులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షలు


ఎక్స్ రే తీస్తున్న సిబ్బంది

జూలూరుపాడు: టీబీ అనుమానితులకు ఉచిత సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షలు స్థానిక పీహెచ్‌సీలో బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ ఆదేశాల మేరకు వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డీటీసీఓ డాక్టర్ పుల్లారెడ్డి పర్యవేక్షణలో ప్రధాన మంత్రి టీబీ(క్షయవ్యాధి) ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా టీబీ రోగులను గుర్తించేందుకు పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ క్యాంప్ ఈనెల 30వ తేదీవరకు పీహెచ్‌సీ పరిధిలోని అన్నారుపాడు, పాపకొల్లు, భేతాళపాడు, కొమ్ముగూడెం, పడమటనర్సాపురం, కాకర్ల, అనంతారం, గుండెపుడి హెల్త్ సబ్ సెంటర్లలో కొనసాగనుండగా.. టీబీ అనుమానితులకు ఎక్స్‌రే, రక్త పరీక్షలు చేస్తారు. కాగా, వైద్య పరీక్షలను పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ బి.వెంకటేశ్వర్లు ప్రారంభించి, వివరాలు వెల్లడించారు. తొలి రోజు 50 మందికి ఎక్స్ రే తీయగా 16 మందిని టీబీ అనుమానితులుగా గుర్తించామని వివ రించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎం.రామకృష్ణ, హెచ్ఎస్ రత్నకుమార్, టీబీ సూపర్‌వైజర్ రఫేల్, హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, ఎక్స్‌రే నిపుణులు సాయికృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ అమూల్య, ఐసీటీసీ ఎల్‌టీ బి.రాహుల్, సిబ్బంది శరత్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే హామీలు


మాట్లాడుతున్న కాంపాటి పృథ్వీ

భద్రాచలంటౌన్: రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ లబ్ధికోసమే విద్యారంగం అభివృద్ధి పేరుతో కొత్త హామీలు ఇస్తున్నారని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ పేర్కొన్నారు. పట్టణంలోని మాస్‌లైన్ కార్యాలయంలో పీడీఎస్‌యూ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఫీజుల నియంత్రణ చట్టం లేకపోవడంతో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో రూ.లక్షలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు, కళాశాలలను నడిపిస్తూ ఫీజుల దోపిడీ చేస్తున్నా.. ప్రభుత్వాలు అడ్డుకట్ట వేయడంలో విఫలమయ్యాయని తెలిపారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25 నుంచి 30 వరకు తెలంగాణ విద్యార్థి పోరు పేరుతో జీపు జాత నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. సమావేశంలో డివిజన్ కార్యదర్శి మునిగల శివప్రశాంత్, రామ్‌చరణ్, పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


వై.రుషివర్మ


కె.వెంకన్నబాబు

పాల్వంచరూరల్: మండలంలోని కిన్నెరసాని గిరిజన క్రీడా పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు వై.రుషివర్మ, కె.వెంకన్నబాబు హైదరాబాద్‌లో జరిగిన వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చూపారు. ఈ నెల 26, 27 తేదీల్లో పుణేలో జరిగే జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం చందు తెలిపారు. ఇందులో విజయం సాధిస్తే ఇండియా జట్టు నుంచి చైనాలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ప్రతిభ చూపాలి

గిరిజన క్రీడాపాఠశాలకు చెందిన విద్యార్థులు క్రీడలతోపాటు చదువులో కూడా ప్రతిభ చూపాలని హెచ్‌ఎం చందు ఆకాంక్షించారు. మండలంలోని గిరిజన క్రీడా పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లోబంగారు పతకాలు సాధించగా బుధ వారం వారిని అభినందించారు. కార్యక్రమంలో వార్డెన్ పోలేబోయిన వెంకటేశ్వర్లు, పీడీలు బాలసుబ్రహ్మణ్యం, పీఈటీ దొడ్డ అంజయ్య, కోచ్ వాసు, సపవాత్ బాలు, స్వరూపారాణి, బట్టు శంకర్, పద్మావతమ్మ, బాలు, భగవాన్‌దాస్, కోటేశ్వరరావు, రామ్‌ధన్, విజయమ్మ, సుక్యా, వెంకన్న, భాస్కర్ పాల్గొన్నారు.

డీఈఈలు, ఈఈలకు అదనపు బాధ్యతలు

ఖమ్మంఅర్బన్: జల వనరుల శాఖలో ఖాళీగా ఉన్న స్థానాల్లో డీఈఈలు, ఈఈలకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 43 మందికి అదనపు బాధ్యతలు కేటాయించగా జాబితాలో ఉమ్మడి జిల్లా నుంచి పలువురు ఉన్నారు. తిరుమలాయపాలెం డీఈఈ రమేశ్‌రెడ్డికి పాలేరు ఈఈగా, ఖమ్మం సీఈ కార్యాలయంలో డీఈ కె.శోభారాణికి అదే కార్యాలయంలో డీసీఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే, సత్తుపల్లి ఈఈ ఎస్.శ్రీనివాస్‌రెడ్డికి కల్లూరు డీఎస్‌ఈగా, మధిర డీఈఈ రాంప్రసాద్‌కు మధిర ఈఈగా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీఅయ్యాయి. అంతేకాక భద్రాద్రి జిల్లా కొత్తగూడెం ఈఈ బి.అర్జున్‌కు ఆ జిల్లా డీసీఈగా, ఇల్లెందు డీఈఈ బి.కృష్ణకు ఇల్లెందు ఈఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

సీపీఎస్ ఈయూ ఆధ్వర్యాన నేడు ముఖాముఖి

ఖమ్మంసహకారనగర్: వీఆర్వోలు, వీఆర్ఏలుగా విధులు నిర్వర్తించి ఇతర శాఖలకు కేటాయించిన వారితో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ (టీజీ సీపీఎస్ ఈయూ) ఆధ్వర్యాన గురువారం ఇతర ముఖాముఖి నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు కొత్తగూడెం కలెక్టరేట్‌లో, మధ్యాహ్నం 3 గంటలకు ఖమ్మం కలెక్టరేట్‌లో, ఆ తర్వాత ఖమ్మం ఆర్డీఓ కార్యాలయంలో ముఖాముఖి ఉంటుందని జీపీఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేందర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశాల్లో టీజీఈ జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి, టీజీసీపీఎస్ ఈయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కె.రామకృష్ణ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దర్శన్‌గౌడ్, నాగవెల్లి ఉపేందర్ పాల్గొంటారని వెల్లడించారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి


దారబోయిన ప్రసాద్ (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: గుండెపోటుతో ఐటీడీఏ పాఠశాల ఉపాధ్యాయుడు మృతి చెందిన ఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని బండారిగుంపులోని గిరిజన ప్రాథమిక పాఠశాల (జీపీఎస్)లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న దారబోయిన ప్రసాద్ (35) మంగళవారం విధులు ముగించుకుని స్వగ్రామమైన అన్నపురెడ్డిపల్లి మండలం కట్టుగూడెం వెళ్లారు. బుధవారం తెల్లవారుజామున ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబీకులు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య, ఏడాది వయస్సు ఉన్న కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, యూటీఎఫ్ నాయ కులు మడివి కృష్ణారావు, కొర్రి వెంకటేశ్, కె.హరినాథ్, నాగరాజు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఒంటరితనం భరించలేక ఆత్మహత్య


వెంకటసాయిరామ్ (ఫైల్)

పాల్వంచ: ఒంటరితనం భరించలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. ఖమ్మం శ్రీనివాసనగర్‌కు చెందిన సుగ్గాల వెంకటసాయిరామ్ (36) శాస్త్రీరోడ్‌లోని పద్మజ ఫ్యాన్సీలో వర్కర్‌గా ఐదేళ్ల నుంచి పనిచేస్తున్నాడు. గట్టాయిగూడెంలో అద్దెకు ఉంటున్నాడు. అతని తల్లి చిన్నప్పుడే చనిపోగా, తండ్రి అనారోగ్యంతో మూడేళ్ల కిందట చనిపోయాడు. ఒంటరితనంతో మానసికంగా కృంగిపోయాడు. గత 15వ తేదీన ఆరోగ్యం బాగోలేదని దుకాణానికి రానని చెప్పాడు. బుధవారం తాను ఉంటున్న గది నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు తలుపులు తీసి చూడగా, ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉన్నాడు. ఒంటరితనం భరించలేకనే ఆత్మహత్యకు పాల్పడినట్లు అతని బంధువు మహిపతి లవరావు ఫిర్యాదు చేయగా.. ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యం


గుర్తు తెలియని మృతదేహం

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం దొరకగా టౌన్ సీఐ నాగరాజు బుధవారం వివరాలు వెల్లడించారు. బస్టాండ్‌లో మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారమివ్వగా వారు అక్కడికి చేరుకున్నారు. మృతుడు కొన్ని రోజులుగా ఆ ప్రాంతంలో భిక్షాటన చేసినట్లు స్థానికులు తెలిపారు. తెలుపు, ఎరుపు నిలువు గీతలు కలిగిన ఆకుపచ్చ రంగు చొక్కా, నీలం, ఆకుపచ్చ రంగు గల శాలువా ధరించాడని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి మార్చురీలో ఉంచామని, సంబంధీకులెవరైనా ఉంటే స్థానిక పోలీస్ స్టేషన్‌లో గానీ లేదా 87126 82106 నంబర్‌లో సంప్రదించాలని టౌన్ సీఐ నాగరాజు కోరారు.

వ్యక్తి ఆత్మహత్యపై కేసు

చంద్రుగొండ: మండలంలోని రావికంపాడు గ్రామానికి చెందిన మోడెం వెంకటేశ్వర్లు (55) పురుగులమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందగా పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. రావికంపాడుకు చెందిన వెంకటేశ్వర్లు ఈ నెల 11న మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. అనంతరం పురుగుల మందు తాగగా అపస్మారక స్థితిలో ఉన్న వెంకటేశ్వర్లును కుటుంబ సభ్యులు కొత్తగూడెం, ఖమ్మం అనంతరం హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు. మృతుడి సోదరుడు రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.